మాలలకు అన్యాయం చేస్తే ఎన్నికల్లో సత్తా చూపుతాం

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ
- 29 నుంచి డివిజన్లలో మాలల బస్తీ బాట కార్యక్రమాలు

నల్లకుంట: డివిజన్ పరిధిలోని సత్యానగర్‌లో కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్లు మన్నె శ్రీధర్, బల్వంత్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో మాలల ఓట్లతోనే సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో మాలలకు అన్యాయం చేస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుతో తమ సత్తాచూపుతామని హెచ్చరించారు. మాలలకు అండగా నిలవని మాల ప్రజాప్రతినిధులు జాతి ద్రోహులుగా మిగిలిపోతారని స్పష్టం చేశారు. మాల కులం ద్వారా విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలలో లబ్ధిపొందిన మాల ఎంపీ, ఎమ్మెల్యేలు ఎస్సీ వర్గీకరణపై మాట్లకపోవడం శోచనీయమని అన్నారు. మాలలను చైతన్య పరిచేందుకు ఈనెల 29వ తేదీ నుంచి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని డివిజన్లలో 'మాలల బస్తీ బాట'కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల మాలలపై చేస్తున్న అసత్య ప్రచారాలను ఈ కార్యక్రమంతో తిప్పి కొడతామన్నారు. 2014 నుంచి 2024 వరకు ఎస్సీ కులాలలో రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు పొందిన వారి వివరాలను కులాల వారీగా శ్వేత పత్రం విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యాక్షన్ కమిటీ ప్రతినిధులు రాజేష్, అంజతా, గోకుల్, కళ్యాణ్ రావు, ఆదర్శ మౌర్య, కొమరం క్రాంతి కుమార్, బత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే 'డాక్ చౌపాల్'

పోస్టల్ శాఖ అధికారిణి హైమావతి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారిణి హైమావతి, కార్పొరేటర్ అమృత

నల్లకుంట: పోస్టల్ శాఖ వినియోగదారులకు అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు 'డాక్ చౌపాల్'అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని నల్లకుంట పోస్టాఫీసు అధికారిణి హైమావతి చెప్పారు. పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు అందుతున్న అన్ని రకాల సేవలు, పథకాలను వివరించేందుకు ఈ కార్యక్రమం వేదికగా చేసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని మినిస్ట్రీ ఆఫ్ కమ్యూనికేషన్స్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ సంయుక్తంగా తీర్చిద్దాయని తెలిపారు. నల్లకుంట పోస్టాఫీస్ ఆధ్వర్యంలో బుధవారం గోల్నాక మార్కెట్ కమాన్ వద్ద 'డాక్ చౌపాల్'పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. సేవలు, పథకాల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేస్తున్నామని తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి పోస్టాఫీసుల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలంగాణలో ఆర్‌పీఐ బలోపేతానికి కృషి



ఆర్‌పీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అభివాదం చేస్తున్న బైగళ్ల నాగేశ్వర్‌రావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను బడుగు, బలహీన వర్గాల ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథావలే) జాతీయ ఉపాధ్యక్షుడు బైగళ్ల నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్‌పీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... తెలంగాణలో ఆర్‌పీఐను బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. అందులో భాగంగా అన్ని జిల్లాల్లో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి ఆయా జిల్లాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరగే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించాలని ఆయన సూచించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ... తెలంగాణలో జరుగుతున్న హైడ్రా అనేది ఒక నాటకమని విమర్శించారు. అయితే చెరువులు, నాలాలు కట్టబెట్టిన మున్సిపల్ అధికారులు, ఐఏఎస్ అధికారులను ఎందుకు సస్పెండ్ చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు కొంపల్లి ప్రభుదాస్, శ్రావణ్, కోరత్‌సింగ్, దీవా, స్నేహలత, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాకు సంపూర్ణ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం చైర్మన్ బాలరాజ్‌గౌడ్

- తెలంగాణ, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ
- చెరువులు, నాలాల విధ్వంసంపై ప్రత్యేక విచారణ చేపట్టాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చెరువులు, నాలాలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చేస్తూ పర్యావరణాన్ని కాపాడుతున్న హైడ్రాకు గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని సంఘం చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చెరువులు, కుంటల రక్షణకు హైడ్రాను తీసుకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి.. దానిని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్న కమిషనర్ రంగనాథ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పకడ్బందీగా అక్రమ కట్టడాలను కూల్చివేయాలని హైడ్రాకు విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. సమైక్యాంధ్రలో, తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన చెరువులు, నాలాల విధ్వంసంపై ప్రత్యేక విచారణ చేపట్టాలన్నారు. హైడ్రాకు ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగిందని హైడ్రాను బలమైన యంత్రాంగంగా ఏర్పాటు చేసి మరింత సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ అక్రమణలపై కొరడాను ఝులిపించాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్‌ను అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: సెల్‌ఫోన్‌ను వినియోగించే వారు ఫోన్‌ను జాగ్రత్తగా వ్యవహరించాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య సూచించారు. బుధవారం రాత్రి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ... ఫోన్ దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. రెండు నెలల క్రితం వరుణ్‌కుమార్ సెల్‌ఫోన్ పోయిందని చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ట్రేస్ చేసి ఫోన్‌ను బుధవారం వరుణ్‌కుమార్‌కు ఇన్‌స్పెక్టర్ అందజేశారు. పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

మంత్రి శ్రీధర్‌బాబుకు జర్నలిస్టుల వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ ప్రతినిధులు

ముషీరాబాద్: అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇళ్ల స్థలాలు ఇచ్చి గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి, మంత్రులు జర్నలిస్టులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని పలువురు జర్నలిస్టు నేతలు ప్రభుత్వాన్ని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యాచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి జాతీయ కార్యదర్శి పి.ఆనందం తదితరులు సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు.

జీవో ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు: మంత్రి

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రత్యేక జీవో రావాలని ప్రభుత్వం ఆ ప్రయత్నం చేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య చాలా కాలంగా ఉందన్నారు. ఈ సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయతిస్తుందన్నారు. దీనికి కొంత సమయం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు సీతారాంచందర్‌రావు, సి.హెచ్. వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, మహిళా జర్నలిస్టులు పి.నాగవాణి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం



సమన్వయం సమావేశంలో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ



ఫ్లైఓవర్ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న డీసీపీ

ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట: గణేష్ ఉత్సవాలను అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో విజయవంతం చేద్దామని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి సూచించారు. బుధవారం అంబర్‌పేట ఛే-నంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అన్ని విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, జోనల్ కమిషనర్ రవికిరణ్‌లతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. గణేష్ ఉత్సవాలు వాడవాడలా జరుగనున్న నేపథ్యంలో అన్ని విభాగాల యంత్రాంగం సమన్వయంతో విధులు నిర్వర్తిస్తే ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. విద్యుత్, జలమండలి, జీహెచ్ఎంసీ, పోలీస్ విభాగాలకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. గణేష్ మండపాలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. సమన్వయం లోపిస్తే అన్ని విభాగాల మీద ప్రభావం పడుతుందన్నారు. సమావేశం అనంతరం అంబర్‌పేట ప్రధాన రోడ్‌లో ఫ్లైఓవర్ నిర్మిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటి పరిష్కారానికి మార్గం చూడాలన్నారు. ఆయన క్షేత్రస్థాయిలో అన్ని విభాగాల అధికారులు సిబ్బందితో కలిసి పనులు జరుగుతున్న ఫ్లైఓవర్ ప్రాంతాలను పరిశీలించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఎంసీ మారుతీ దివాకర్, ఆడిషినల్ డీసీపీ నర్సయ్య, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలత, ఏసీపీలు సంపత్, రఘులతో పాటు ఇతర ఇంజినీరింగ్, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

31న గణేష్ ఉత్సవ సమితి సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న బీజీయూఎస్ ముషీరాబాద్ కన్వీనర్ విజయ్‌కుమార్

ముషీరాబాద్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఏనుగుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సమితి సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 31వ తేదీన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం గణేష్ మండపాల నిర్వహకులతో భారీ సదస్సు ఏర్పాటు చేయనుందన్నారు. ప్రతి మండప నిర్వహకులు ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు. హిందూ ఐక్యత చాటి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు శివాజీ, మహేందర్‌బాబు, శక్తిసింగ్, రాజు పాల్గొన్నారు.

3 నుంచి ఉచితంగా స్తోత్ర వైభవ గ్రంథం పంపిణీ

చిక్కడపల్లి: రానున్న వినాయక చవితి నేపథ్యంలో ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ రచించిన లలితా, విష్ణు సహస్ర నామ స్తోత్ర వైభవ గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని త్యాగరాయ గానసభ అధ్యక్షుడు, శృంగేరి జ్ఞాన సరస్వతి దేవాలయం ధర్మాధికారి కళాజనార్దన మూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన గానసభ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ 3, 4వ తేదీలలో గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న జ్ఞాన సరస్వతి ఆలయంతో పాటు త్యాగరాయ గానసభలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రంథాన్ని అందజేస్తామన్నారు.

కలెక్టర్ ఆకస్మిక పర్యటన



రాంనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీకాలనీలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఆకస్మిక పర్యటన చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలించారు. దోమల నివారణ చర్యలపై ఆరా తీశారు. – ముషీరాబాద్

మున్నూరు కాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న మున్నూరుకాపు నేతలు

కవాడిగూడ: మున్నూరుకాపులకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేనా రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేనా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది రూ.5వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని నినాదాలు చేశారు.

◆ ఈ సందర్భంగా ఉగ్గే శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. మున్నూరుకాపు సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించే 42శాతం రిజర్వేషన్లలో మున్నూరుకాపులకు 15శాతం అమలు చేయాలని కోరారు. మున్నూరుకాపుల పేరు చివరన పటేల్ అనే గెజిట్‌ను విడుదల చేయాలని కోరారు.

◆ సెప్టెంబర్ 8న స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేస్తూ జ్యోతిరావు పూలే భవన్‌లో వేలాదిమందితో వినతి పత్రాలు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. బీసీల పేరుతో ఉన్న పూలే భవన్‌లో బీసీల సమస్యలు పరిష్కారం కాకుంటే పాలకుల భవన్‌గా ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు చామకూర సుజాత, నేతలు ఆకుల మంజు, సంగీత, రాష్ట్ర కో కన్వీనర్‌లు కె. మహేష్‌కుమార్, బత్తుల రాములు, సి.హెచ్. ప్రదీప్, బి. శ్రీనివాస్, రామిని సందీప్, వెంపటి సోమన్న, నాయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

చిక్కడపల్లి: నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్ కమిషన్ తెలంగాణ లీగల్ సెల్ అధ్యక్షుడిగా పోతంశెట్టి నగేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ప్రముఖ న్యాయ్యవాదులు ఆయనకు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. చంద్రదర్శన్‌రావు, కొంగరశ్రీనివాస్, మహ్మద్ ముంతాజ్ పాషా, సురేందర్‌రెడ్డి, రోషం బాలు, డా. మర్రి మల్లికార్జున్, సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సినీసంగీత విభావరిలో గాయకులు

చిక్కడపల్లి: కాకినాడ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో సినీదర్శకుల స్వరమాలిక శీర్షికతో త్యాగరాయ గానసభలో బుధవారం రాత్రి నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది.గాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న ఏకగళ, యుగళ గీతాలను గాయకులు రామలక్ష్మి, శారద సాయి, వెంకన్నబాబు, ఉమాసింధు, కుమార్‌లు ఆలపించారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం ముఖ్యఅతిథిగా పాల్గొని గాయకులను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు సీహెచ్ త్రినాథరావు, జి.ఉమాదేవి, కోటేశ్వర్‌రావు, శంతన్‌కుమార్, బ్రహ్మానందం, పరందామన్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

అంబర్‌పేట: చెన్నారెడ్డినగర్‌లో ఎంతో కాలంగా స్థానికులు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని... వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ తెలిపారు. డివిజన్‌లోని చెన్నారెడ్డినగర్ ప్రాంతంలో డ్రైనేజీ పైపులైన్ పగిలిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ బుధవారం పర్యటించారు. సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. డ్రైనేజీ సమస్యతో వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు.

కార్మికుల వైద్య పరీక్షల పేరిట భారీ దోపిడీ

- సీపీఎం గ్రేటర్ కార్యదర్శి శ్రీనివాస్
- రక్త నమూనాలు సేకరించి 18 రకాల పరీక్షలు చేస్తున్నట్లు రిపోర్టులు
- ఒప్పందాన్ని రద్దు చేసుకుని వెంటనే విచారణ జరిపించాలి

ముషీరాబాద్: భవన ఇతర నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు జరిపేందుకు సీఎస్‌ఈ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు 2022లో కాంట్రాక్టు ఇచ్చిందని ఒక్కో కార్మికుడికి పరీక్ష నిర్వహించినందుకు బీఓసీడబ్ల్యూ కాంట్రాక్టు సంస్థకు రూ.3256 చెల్లిస్తోందని సీపీఎం గ్రేటర్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. కార్మికుల దగ్గర రక్త నమూనాలు మాత్రమే సేకరించి 18 రకాల పరీక్షలు చేస్తున్నట్లు రిపోర్టులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెల్త్ క్యాంపులు నిర్వహించకపోయిన నిర్వహించినట్లు తప్పుడు లెక్కలు రాసుకోని భారీ మొత్తంలో నిధులు క్లెయిమ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ కాంట్రాక్టు సంస్థ ఇచ్చే రిపోర్టులను డాక్టర్లు కూడా విశ్వసించడం లేదన్నారు. సీఎస్‌సీ హెల్త్ కేర్ లిమిటెడ్ సంస్థ 2022లో ఏర్పాటయ్యిందన్నారు. అదే ఏడాది ఎలాంటి టెండర్ లేకుండా అనుభవం లేని కంపెనీతో ఒప్పందం ఎలా కుదర్చుకుందో బీఓసీడబ్ల్యూ బోర్డు సమాధానం చెప్పడం లేదన్నారు. కార్మికులపై ఒత్తిడి తెచ్చి బెదిరింపులు చేస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆర్‌టీఐ కింద కాంట్రాక్ట్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం కాపీ ఇవ్వమని అడిగితే కార్మిక శాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. ఏడాదిన్నర కాలంలో 9.50 లక్షల మందికి పరీక్షలు నిర్వహించారని రూ.298 కోట్లు కాంట్రాక్ట్ సంస్థకు చెల్లించారన్నారు. వైద్య పరీక్షల పేరిట కార్మిక నిధులు దోపిడీ చేస్తున్న సీఎస్‌సీ హెల్త్ కేర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిధుల కుంభకోణంపై అవినీతి నిరోధక శాఖతో విచారణ జరిపించాలన్నారు.

ఘనంగా వివాహ వార్షికోత్సవం



గుర్రం శంకర్, చంద్రకళల దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేణుపాల్‌రావు, ఎఫ్‌సీఐ చైర్మన్ ఫయిమ్, నాయకులు

చిక్కడపల్లి: కాంగ్రెస్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్, చంద్రకళ దంపతుల 35వ వివాహ వార్షికోత్సవం బుధవారం గాంధీనగర్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు కె.వేణుపాల్‌రావు, ఎఫ్‌సీఐ చైర్మన్ ఫయిమ్, పీసీసీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిన్నారాజు, యాదగిరి లక్‌పతి, భాస్కరరెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ, రాజు కెనడీ, గుర్రం దినేష్ హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం



ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికేందుకు ర్యాలీగా వెళ్తున్న నేతలు

ముషీరాబాద్: రాజకీయ ప్రేరేపిత కేసులో ఎమ్మెల్సీ కవితపై అక్రమంగా కేసులు పెట్టినప్పటికీ చిరవకు న్యాయమే గెలిచిందని బీఆర్ఎస్ యువజన కమిటీ నగర నాయకులు ముఠా జైసింహ అన్నారు. బుధవారం ఎమ్మెల్సీ కవిత తీహార్ జైలు నుంచి విడుదలై ఢిల్లీ నుంచి మొట్టమొదటి సారి హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ ర్యాలీ బోలక్‌పూర్ నుంచి శంషాబాద్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ రావు, మహ్మద్ ఆలీ, రహీం, పబ్బ కృష్ణ, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలి

అంబర్‌పేట: నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బాగ్అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం డివిజన్‌లోని సాయి మధురానగర్‌లో చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ పనులను ఆమె పర్యవేక్షించారు. పనులను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

ఎస్ఆర్‌డీ, హెచ్ఓహెచ్ దాతృత్వం

కరోనాలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల చదువుకు రూ.6లక్షల విరాళం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సొసైటీ ఫర్ ది రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ), హిల్ ఆఫ్ హోప్ సంస్థ దాతృత్వాన్ని చాటుకున్నాయి. కరోనాలో తల్లిదండ్రులను కోల్పోయిన 50మంది పేద పిల్లల స్కూల్ ఫీజు, ఇతర ఖర్చుల కోసం రూ.6లక్షల ఆర్థిక సహాయాన్ని ఉపాధ్యాయులకు అందజేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఎస్ఆర్‌డీ కార్యాలయంలో డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడేళ్లుగా కోవిడ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు తమ వంతుగా ఆర్థిక సహాయం చేస్తూ ఆదుకుంటున్నామని అన్నారు. భవిష్యత్‌లో కూడా వారికి అండదండగా ఉంటూ విద్యా పరంగా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హిల్ ఆఫ్ హోప్ ప్రతినిధి సరహ గల్ బ్రెట్, ఎస్ఆర్‌డీ ప్రతినిధులు శివరాణి, వెంకటేశ్వరి, నీలకంఠ, రజనీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి



కవాడిగూడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిని గుంతలమయంగా మారిన సీసీరోడ్లు స్థానంలో నూతన వీడీసీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్పొరేటర్ రచనశ్రీ బుధవారం అధికారులను ఆదేశించారు. కవాడిగూడ డివిజన్ పరిధిలోని దోమలగూడ, పూల్‌బాగ్, గంగపుత్ర గల్లీలో అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణానికి రోడ్లు దెబ్బతిన్నాయని స్థానికులు తెలిపారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సుభాష్, వర్క్ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నాయకులు వెంకటేష్, ఎంసీ మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, శివరాజ్, రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ కుంట పక్కా ప్రైవేటు ల్యాండ్



హైడ్రా కమిషనర్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: అంబర్‌పేట బతుకమ్మ కుంట స్థలం ప్రైవేటు పట్టా స్థలం అని బీఆర్ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి హైడ్రా కమీషనర్ ఏవీ రంగనాథ్‌కు వివరించారు. కొద్ది మంది తప్పుడు పత్రాలు చూయించి తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. వాస్తవం తెలుసుకొని చర్యలు తీసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి బతుకమ్మ కుంట ప్రైవేటు పట్టా స్థలామని దీనికి భూమి సిస్తూ చెల్లించామని, సేత్వార్ కాపీ, 1960 ఆర్‌వోఆర్, మ్యూటేషన్ కాపీలను కమిషనర్‌కు అందజేశారు. పార్క్ స్థలామనేది బాగ్ అంబర్‌పేట వేల్ఫేర్ సొసైటీ, తులసీ కోఆపరేటివ్ సొసైటీకి కేటాయించిన స్థలంలోనిది అని వివరించారు. కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ముందు నుంచి దురుద్దేశంతో బతుకమ్మ కుంటపై వివాదాం చేస్తున్నాడని చెప్పారు. ప్రతి రికార్డును పరిశీలించాలని ఆయన కమిషనర్‌కు కోరారు. స్థలానికి సంబంధించిన యాజమానులు హమీద్, హకీం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌లో వీనస్ సైబర్ టెక్ విజయం



మిథుల్ (95 పరుగులు)

ముషీరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ క్రికెట్ అకాడమీ జట్టుపై వీనస్ సైబర్ టెక్ జట్టు రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాంనగర్‌కు చెందిన మిథుల్ 95 పరుగులు చేసి జట్టులో కీలక పాత్ర పోషించాడు. 143 బంతులు ఆడిన మిథుల్ 95 పరుగులు చేయగా అందులో కళ్లు చెదిరే 15 ఫోర్లు, రెండు భారీ సిక్సర్లు ఉన్నాయి. మిథుల్ ఆట తీరుపై జట్టు సభ్యులతో పాటు నిర్వహకులు ప్రశంసల జల్లు కురిపించారు. మొదటి బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ క్రికెట్ అకాడమీ 282 పరుగులు చేసి ఆల్ అవుట్ కాగా తర్వాత బ్యాటింగ్ చేసిన వీనస్ సైబర్ టెక్ జట్టు 8 వికెట్ నష్టపోయి 283 పరుగులు చేసింది.